ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

5★★ జిల్లా వార్తలు

మంగళవారం 9 సెప్టెంబరు 2025



హెపటైటిస్ నియంత్రణపై నజర్





- నేటి నుంచి మూడు రోజుల పాటు వైద్యులు, సిబ్బందికి వ్యాక్సిన్
- మూడు డోసులుగా అందించేందుకు కసరత్తు
- 2030 నాటికి వైరస్‌ను అంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

జగిత్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్(పచ్చకామెర్లు) వ్యాధి నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. 2030 నాటికి 'కాలేయాన్ని కాపాడుదాం-హెపటైటిస్‌ను ఓడిద్దాం'. అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళ్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై నుంచి హెపటైటిస్ నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. హెపటైటిస్ అనేది కాలేయానికి సంబంధించి ఉండే వాపు. ఇది వివిధ రకాల వైరస్‌ల వల్ల ఏర్పడుతుంది. ముఖ్యంగా దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. బాధితులకు చికిత్స అందించే వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వైరస్ సోకే ప్రమాదం ఉండడంతో వారందరికీ వ్యాక్సిన్ వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

● జిల్లాలో వైద్య సిబ్బందికి 2,330 డోసుల గుర్తింపు

హెపటైటిస్ వ్యాధి నియంత్రణకు ముందుగా హైరిస్క్ వర్గాలైన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వ్యాక్సిన్ వేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదిన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో, 10,11 తేదీల్లో కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి సామాజిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, పారిశుధ్య కార్మికులకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని ప్రొఫెసర్లు, సిబ్బందితో పాటు ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు, నర్సింగ్ చదివే విద్యార్థులందరికీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెపటైటిస్ వ్యాక్సిన్ వేయనున్నారు. మొత్తంగా మూడు డోసులుగా ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ముందస్తుగా ఈనెల 9,10,11 తేదీల్లో మొదటి డోసు వేసుకున్న వారికి నెల రోజుల తర్వాత రెండో డోసు, ఆరవ నెలలో మూడో డోసు వేయనున్నారు. జిల్లాలో మూడు విడతల్లో వైద్యులు, సిబ్బందికి 2,330 డోసులు అవసరమని వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. అనంతరం ఐదేళ్ల తర్వాత బూస్టర్ డోస్ వేయనున్నారు.

● ప్రమాదకరమైన వైరస్

ఒకసారి హెపటైటిస్ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తే శరీరంలో దాని సంఖ్య లక్షల్లో పెరిగి కాలేయాన్ని దెబ్బతీయడం ఆరంభిస్తుంది. ఈ వైరస్ శరీర ద్రవాల ద్వారా వ్యాపిస్తుండగా, రక్త మార్పిడి, సూదులు, సిరంజిలు తల్లి నుంచి బిడ్డకు సంక్రమించవచ్చని వైద్య వర్గాలు అంటున్నాయి. పరీక్షల్లో హెచ్‌బీఎస్ఏజీ కూడా పాజిటివ్‌గా ఉండి ఎస్‌జీపీటీ (కాలేయానికి సంబంధించిన ఎంజైమ్) ఉండాల్సిన

- మిగతా 8లో

జిల్లాలోని వైద్యులు, సిబ్బంది వివరాలు..	
జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్	491 మంది
తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో	215 మంది
పారామెడికల్	198 మంది
ఏఎన్ఎంలు	248 మంది
ఎంఎల్‌హెచ్‌పీలు	101 మంది
ఆశా కార్యకర్తలు	735 మంది
మెడికల్ కళాశాల విద్యార్థులు	450 మంది
నర్సింగ్ కళాశాల విద్యార్థులు	200 మంది
మూడు విడతల్లో మొత్తం డోసులు	2,330

వైద్యులు, సిబ్బందికి వ్యాక్సిన్...



ఈనెల 9,10,11 తేదీల్లో వైద్యులు, సిబ్బందికి ముందస్తుగా హెపటైటిస్ వ్యాక్సిన్ వేయనున్నాం. జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్‌తో పాటు, ప్రొఫెసర్లు, వైద్యులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల వైద్యులు, పారిశుధ్య సిబ్బందికి, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ప్రోగ్రాం ఆఫీసర్లకు వ్యాక్సిన్ వేస్తాం.

- డాక్టర్ ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

బతుకమ్మ కుంటను పరిశీలించిన అటవీ అధికారి



బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో పద్మారావు

సారంగాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బతుకమ్మ కుంటను ఎఫ్ఆర్‌వో పద్మారావు సోమవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో బతుకమ్మ కుంట మత్తడి పూర్తిగా వరదకు కొట్టుకుపోయింది. మత్తడి మరమ్మతు చేపట్టాలని కోరుతూ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్, డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధికారుల సూచనల మేరకు సోమవారం ఎఫ్ఆర్‌వో పద్మారావు బతుకమ్మ కుంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల సూచనలు తీసుకొని కట్ట మరమ్మతులు చేపడ తామన్నారు. తక్షణం కుంటలోని నీరు వృథాగా పోకుండా మట్టి కట్టలు కడతామని ఆయన పేర్కొన్నారు.

నూతన సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలి

-డీఆర్‌డీవో రఘువరణ్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూతన సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలని డీఆర్‌డీవో రఘువరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య మందిరంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాళ్లతో డీఆర్‌డీవో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీపీఎంలు రమేష్, నారాయణ, నాగేశ్వర్‌రావు, స్త్రీనిధి ఆర్.ఎం రాంనారాయణ, ఏపీఎం లు గంగాధర్, చక్రవర్తి, త్రివేణి, ఎంఏ హుస్సేన్, దాసు, దేవయ్య, సంతోస్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : జగిత్యాల మండలం మోతె శివారులోని అష్టలక్ష్మీ దేవాలయ ఆవరణలో జరగనున్న దసరా నవరాత్రుల వైదిక కార్యక్రమాల కరపత్రాన్ని సోమవారం శ్రీమాన్ నంబి గోపాలచార్య ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కనకదుర్గ సేవాసమితి సభ్యులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

'సన్న వడ్ల బోనస్‌ను విడుదల చేయాలి'

రాయికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యాసంగి వడ్లు విక్రయం జరిగి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం సన్నాలకు ఇస్తానన్న క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఇప్పటి వరకు విడుదల చేయాలని రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి అన్నారు. సన్న వడ్లు దిగుబడి తక్కువ అని తెలిసి బోనస్‌ను దృష్టిలో పెట్టుకొని సాగు చేసిన రైతులకు ఎదురుచూపులుగా మిగిలాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో పంటలు అధిక వర్షాలకు దెబ్బతిని పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం బోనస్ త్వరగా విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

ధర్మపురి నరసింహుడి ఆలయ ప్రసాదాల రేట్లు పెంపు 7

తెరుచుకున్న ఆలయాలు ● భక్తుల ప్రత్యేక పూజలు 7

ఓటరు జాబితా అభ్యంతరాలపై అఖిలపక్ష సమావేశం ● ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహణ 8

ఘనంగా ఫిజియోథెరపీ డే



రక్తదానం చేస్తున్న ఫిజియోథెరపీ వైద్యులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపీ డే వేడుకలు నిర్వహించారు. జిల్లా ఫిజియో థెరపీ వైద్యుల ఆధ్వర్యంలో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజన వసతి కల్పించారు. అనంతరం పలువురు వైద్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫిజియో థెరపీ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు వొల్లాల అశోక్, ఇందూరు అనిల్ కుమార్, ఎండి యాకూబ్, విజయ్ చరణ్, సతీష్, అజరొద్దీన్, శిరీష, లక్ష్మీ, స్వప్న, రమ్య పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



ఎన్నికైన నీట్ పేరెంట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

జగిత్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని నీట్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి అంజయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజయ్య మాట్లాడారు. తెలంగాణ నీట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లలో స్థానికత అంశంపై జీవో 33 అమలుపై ఉద్యమించి సాధించుకున్న విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయి అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లోజు సత్య నారాయణ, ఉపాధ్యక్షులుగా బొడ్డుపల్లి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జాయింట్ సెక్రెటరీలుగా రఘుపతి, రాజు, ప్రధాన సలహాదారుగా కమలాకర్‌రావు, కోశాధికారిగా శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా భాస్కర్, రవి కుమార్, సుజాత, కార్యవర్గ సభ్యులుగా స్వప్న, మానస, నరహరి, రత్నప్రసాద్, నరేందర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో దామోదర్‌రెడ్డి

మల్లాపూర్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మండల విద్యాశాఖాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. మండల స్థాయి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆటల పోటీలు, జిల్లా స్థాయి ఎంపిక పోటీలు చిట్టాపూర్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్న, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణస్వామి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి చంద్రకళ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమారం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన సొన్న లక్ష్మి అనారోగ్యంతో జగిత్యాలలో చికిత్స పొందుతుండగా గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి

● మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి



మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి

జగిత్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపేలక్ష్యంగా కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం తాటిపర్తి విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ లెవల్ నుంచి మహిళా కాంగ్రె స్‌ను బలోపేతం చేయాల్సిన అవసర ముందన్నారు. ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని జిల్లా, మండలం, పట్టణ బాధ్యులకు సూచించారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ జెండా ఎగిరేలా మహిళా కాంగ్రెస్ కృషి చేయాలన్నారు. మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ అనేక కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళకు ఒక వరం అని, త్వరలోనే చేయూత కార్యక్రమం అమలు చేసి పెన్షన్ దారులకు ఊరట కలిగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. స్వయం సహాయక బృందాలకు ఆర్టీసీలో భాగస్వామ్యం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం బస్సులను కొనుగోలు చేసి ఆర్థిక ప్రగతికి బాటలు వేసిందని తాటిపర్తి విజయలక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుం దన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టి అమలు చేస్తున్న పథకాలతో ఇతర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కాగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బమ్మ హాజరై జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల పురోగభివృద్ధి, మహిళా కాంగ్రెస్ బలోపేతం కోసం చేపట్టాలసిన చర్యలు, రానున్న ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ పోషించాల్సిన పాత్రపై సభ్యులకు క్షుణ్ణంగా వివరించారు. సమావేశంలో పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పిప్పరి అనిత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ అనుమల్ల జయశ్రీ, రేణుక, పద్మ సింగరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ బాధ్యులు అల్లాల సరిత, చిట్ల లత, రూప, ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షురాలు మంజుల, మండల బాధ్యులు పాల్గొన్నారు.

'ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు'



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి) :ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. అధికారులు శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి ఆర్డీఓలు మదుసూదన్, శ్రీనివాస్, జీవాకర్‌రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 29 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

వేతనం చెల్లించాలి: మెప్మా ఆర్పీలు

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న మాకు ప్రభుత్వం నుంచి నేరుగా వేతనాలు చెల్లించాలి. నిత్యం మహిళా సంఘాల బలోపేతానికి, మహిళల ఆర్థిక పురోగతికి తాము చేస్తున్న సేవలను గుర్తించాలి. ప్రభుత్వానికి కావాల్సిన అనేక సర్వేలలో కావాల్సిన సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నాము. ఇంతచేసినా మాకు తగిన గుర్తింపు లేదు. శ్రమకు తగిన ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాకు ప్రతి నెలా జీతాలు ఇవ్వడంతో పాటు తమకు సంబంధం లేని పనులను మాకు అప్పగించి ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలి.



ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

పాస్‌పోర్ట్ పోయినది

★ జంగాపల్లి నిసీషా తండ్రి : మధుసూదన్ ఇ.నెం. 8-6-177/1, క్రిష్ణనగర్, గోదావరిఖని అను నా యొక్క పాస్‌పోర్టు నెం.W1364897 గలది అగస్టు 23వ గోదావరిఖని బస్టాండ్‌లో పోయినది. కావున దొరికిన వారు పై అడ్రస్‌లో సెల్ : 86399 26848 లో అప్పగించగలరు.

AJK-

CHANGE OF NAME

★ I, MOHAMMAD ABDUL AZEEM, S/O. MOHAMMAD ABDUL GAFFAR, R/O. H.NO. 8-3-447, MOMINPURA, GODAMGADDA, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS " MOHAMMED ABDUL AZEEM " S/O. " MOHAMMED ABDUL GAFFAR "

AJK-17223

CHANGE OF SURNAME

★ I CHALLA SHANKARAIAH S/O. CHINNA MUTHYALU R/O. 1-97/2, VENKATAPOOR VILLAGE, KORUTLA MANDAL JAGITHYAL DIST. NOW I CHANGED MY SURNAME AS SALLA SHANKARAIAH S/O CHINNA MUTHYALU.

AJK-17223

CHANGE OF NAME

★ I, JELLA POCHAIAH, S/O. NARSAIAH, R/O. H.NO. 1-117, VELGONDA (V), BUGGARAM (M), JAGTIAL (D). HAVE CHANGED MY NAME AS " JELLA POSHAIAH ", S/O. NARSAIAH.

AJK-17224

BUSINESS OFFER

ఫ్రాంఛైజీ ఆఫర్ : రూ :2 లక్షల డిపాజిట్ తో మీ ఏరియాల్లో "శ్రీ విజయలక్ష్మి పికిల్ స్టోర్" ని ప్రారంభించి షాపులో కూర్చుని బిజినెస్ చేస్తూ ప్రతి నెల 30 వేలు సాలరీ మరియు బిజినెస్ పై 30% మార్జిన్ పొందండి. సెల్: 8143909459

AJM-13961

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర : 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్ : 99854 11063

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 12క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠధర రూ.7450 చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు.

వ్యవసాయ మోటార్ల సర్వీసు వైర్లు చోరీ

గంగాధర, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో 15 మంది రైతుల వ్యవసాయ మోటర్ల విద్యుత్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రైతులు సోమవారం ఉదయం నీరు పెట్టడానికి పొలం వద్దకు వెళ్లారు. వ్యవసాయమోటర్లకు స్టార్టర్ల నుంచి విద్యుత్‌వైర్ కత్తిరించి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన 15మంది రైతుల బోర్లు, బావులు, కాలువ నుంచి సాగునీరందించే మోటార్ల వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లారని రైతులు వాపోయారు. ఎత్తుకెళ్లిన కేబుల్స్‌ను కాల్చి రాగి తీగలను అమ్ముకుంటారని రైతులు తెలిపారు. గతంలో కూడా గ్రామానికి చెందిన పలువురి మోటర్లతోపాటు విద్యుత్‌తీగలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ దొంగలను గుర్తించలేదని రైతులు వాపోయారు. దొంగల బాధ నుంచి తమ మోటార్లను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష


బుగ్గారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని యశ్వంతరావుపేటకు గ్రామానికి చెందిన నక్క పరమేశ్వర్ అనే మేస్త్రిపై దాడి చేసిన గజ్జల నరేష్‌కు ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ యేగి జానకి సంవత్సరం జైలుశిక్ష, 1000 రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. నరేష్ తన ఇంటి స్లాబ్ నిర్మాణం కోసం పరమేశ్వర్‌తో 20వేల రూపాయలకు ఒప్పందం చేసుకోవడంతో పని పూర్తిచేశాడు. అనంతరం నరేష్ డబ్బులు ఇవ్వకపోగా పరమేశ్వర్‌పై 2021 ఆగస్టు 17రోజు తలపై దాడిచేశాడు. దీంతో పరమేశ్వర్ బుగ్గారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా అప్పటిఎస్సై ఉపేంద్రచారి కేసు నమోదు చేసి నరేష్‌ను కోర్టులో హాజరు పరిచాడు. సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి నిందితుడికి జైలుశిక్ష జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామశివారులోని రైస్‌మిల్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఒకరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గొల్లపల్లి తరుణ్ తన స్నేహితుడు అరవింద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి వరంగల్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్ శివారులోని రైస్‌మిల్ వద్ద వాహనం అదుపుతప్పి కింద పడడంతో తరుణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్నేహితుడు అరవింద్ వెంటనే అతన్ని 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించాడు.

మహనీయుడి పేరుతో.. మన భాషా దినోత్సవం

- నేడు కాళోజీ జయంతి
- తెలంగాణ భాషా దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకనీది.. చావునీది.. బతుకంతా దేశానిది.. దోపిడీ చేసే ప్రాంతేతరుడిని దూరంగా తన్ని తరుముదాం.. ప్రాంతంవాడే అయితే ప్రాణంతోనే ఇక్కడే పాతి పెడదాం.. అంటూ నినదించిన ప్రజాకవి కాళోజీ. తన గొడవనే ప్రజా గొడవగా మలచి విలక్షణ అక్షర యోధుడిగా, మానవతా వాదిగా కనిపిస్తారు కాళోజీ నారాయణరావు. ఆ మహనీయుని జన్మదినాన్ని 2001 నుంచి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నది. ఇది కాళోజీకి దక్కిన సముచిత గౌరవం. ఓనాడు తిరస్కరణకు, అవమానాలకు గురైన భాష, మన యాస ఇప్పుడు అందలమెక్కుతున్నది. కాళోజీ స్ఫూర్తితో మన భాషకు మనం పట్టం కట్టి గౌరవించుకోవాలి.

తెలంగాణ భాషకు, భావజాలానికి, ప్రాంతీయ కవిత్వానికి విడదీయరాని సంబంధమున్న కాళోజి 9-9-1914లో హన్మకొండలో జన్మించారు. 13-11-2002లో మృతి చెందారు. కాళోజీ నిజాం నిరంకుశ పాలనపై నిర్బంధ్వంగా ఉద్యమిస్తూ దాదాపు 1987 వరకు తెలంగాణ ఉద్యమ కవితలు రాశారు. పౌర హక్కుల కోసం నిజాయితీగా పోరాడుతూ కలాన్ని ఖడ్గంగా ఉపయోగించారు.

న్యాయశాస్త్రం చదివినా ఏనాడూ ప్రాక్టీస్ చేయకుండా, ఉద్యోగం చేయకుండా తండ్రి అనంతరం అన్న రామేశ్వర్‌రావు పోషణలో పెరిగారు. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమయ్యే కాళోజీ ఉద్యమనేతగా, రాజకీయవాదిగా, కవిగా, భాషోద్యమనేతగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారు. ప్రశ్నించే తత్వాన్ని నేర్చుకుని ఇతరులకు నేర్పిన మహోన్నతుడు. సిద్ధాంత నిబద్ధత నచ్చేస్వేచ్ఛావాదిగా ధర్మపోరాటం చేస్తూ ప్రజాకవిగా తెలంగాణలోని అణువణువునా కనిపిస్తూనే ఉంటారు.

● జిల్లాతో అనుబంధం..

ఉమ్మడి జిల్లాతో, కవులతో కాళోజీకి మంచి అనుబంధం ఉంది. ఆయన కరీంనగర్‌కు 2001లో వచ్చారు. ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో 2001 డిసెంబరు 7, 8 తేదీల్లో జరిగిన తెలంగాణ మాండలిక సాహిత్యంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో రచయిత దాశరథి రంగాచార్యతో కలిసి పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ కాళ్లు, చేతులు వణుకుతున్నా ఉద్వేగంతో ఆయన చేసిన ప్రసంగం చైతన్య పరిచింది. జిల్లాకు చెందిన ఎందరో కవులు, రచయితలు హన్మకొండకు వెళ్లి ఆయనను కలిసి వచ్చేవారు. జిల్లాకు చెందిన మాజీ ప్రధాని పీవీతో కాళోజీకి అత్యంత సన్నిహిత సంబంధాలుండేవి.

రవాణాశాఖలో శిక్షణకు ఎంపికైన ఏఎంవీఐలు

- 15 రోజులపాటు జిల్లా రవాణాశాఖ కార్యాలయ పరిధిలో విధులు
- తనిఖీల్లో 10 వాహనాల జప్తు

తిమ్మాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రవాణాశాఖలో నూతనంగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)లను నియమించింది. శిక్షణలో భాగంగా మండలంలోని జిల్లారవాణాశాఖ కార్యాలయానికి 10మంది నూతనంగా ఎంపికైన ఏఎంవీఐలు ఏ మనోజ్‌కుమార్, బి స్వాతి, డి మనోజ్ కుమార్, బి శిరీషా, డి అఖిల, ఎం శ్వేత, జి జాన్ రోనాల్డ్ ఈద, బి నవిత, సీహెచ్ మమత డీటీసీ పురుషోత్తంకు సోమవారం రిపోర్ట్ చేశారు. వీరు 15రోజుల పాటు కరీంనగర్ ఆర్టీవో శ్రీకాంత్‌చక్రవర్తి ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోనున్నారు. మొదటిరోజు శిక్షణలో భాగంగా నూతనంగా విధుల్లోకి చేరిన ఏఎంవీఐలతో కలిసి డీటీసీ, డీటీవో, నూతనంగా విధుల్లోచేరిన ఏఎంవీఐలతో కలిసి అలుగునూర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వీరికి 15 రోజులపాటు వాహనాల తనిఖీలు, చెక్ రిపోర్ట్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజల రవాణాభద్రత కోసం ఇలాంటి తనిఖీలు, శిక్షణ నిరంతరం కొనసాగుతాయని అన్నారు. తనిఖీలోభాగంగా టాక్సులు, పొల్యుషన్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌లేని వివిధరకాల 10వాహనాలను జప్తుచేసినట్లు శ్రీకాంత్‌చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ పురుషోత్తం, డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవీకుమార్, ఏఎంవీఐ శ్రవంతి, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.



అలుగునూర్‌లో వాహనాల తనిఖీపై ఏఎంవీఐలకు శిక్షణ ఇస్తున్న డీటీసీ, డీటీవో

బొగ్గు బాయిలో చోరీకి యత్నం

గోదావరిఖని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీడీకే 2ఇంక్లైన్ బొగ్గు గనిలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. మూతబడిన టన్నెల్‌లోకి దిగి కాపర్‌వైరు, ఇనుప సామాన్లు దొంగిలించేందుకు ప్రయత్నించారు. గనిలోని 3, 4 సీములు, 17వలెవల్‌లో గతంలో బొగ్గు తీసి ఆ ప్రాంతాన్ని వదిలేశారు. గనివెనుక భాగం నుంచి సుమారు 8మంది బొగ్గు బాయిలోకి దిగారు. రాత్రి కావడం, అండర్‌గ్రౌండ్ కావడంతో దొంగలు టార్చ్‌లైట్లను తీసుకువచ్చారు. ఆ లైట్ల వెలుతురును గనిలో పని చేస్తున్న కొందరు కార్మికులు గమనించారు. ఎవరని ప్రశ్నించి కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. ఈ విషయాన్ని కార్మికులు అధికారులకు తెలియజేయడంతో ఎస్ అండ్‌పీసీ సిబ్బందిని పంపించగా అప్పటికే దొంగలు పరారయ్యారు. బొగ్గు గని లోపల దొంగతనానికి యత్నించడం చర్చనీయాంశమైంది.

లైంగిక దాడి ఘటనపై కొనసాగుతున్న విచారణ

- ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్, సీపీ
- డాక్టర్, సిబ్బంది విచారణ...
- ఎమర్జెన్సీ వార్డులో తాగుబోతు కాంపౌండర్ విధులు..?

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆదివారం వేకువజామున ఓ యువతిపై జరిగిన లైంగిక దాడి ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతున్నది. వైద్యసేవల కోసం వచ్చిన యువతిపై ఆ ఆసుపత్రి కాంపౌండర్ దక్షిణమూర్తి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఆసుపత్రి నిర్వాహకుల నిర్లక్ష్యాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. యువతికి మత్తుమందు ఇచ్చి లైంగికదాడికి పాల్పడిన దక్షిణామూర్తి (24) అనే కాంపౌండర్ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ సహాయకుడిగా పని చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అంతకు ముందు రెండు ఆసుపత్రుల్లో పనిచేసిన దక్షిణామూర్తి మద్యం సేవించి విధులకు వస్తుండటంతో ఆ ఆసుపత్రుల యాజమాన్యం విధుల నుంచి తొలగించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయినా దక్షిణామూర్తిని ఆసుపత్రిలో కీలకమైన ఎమర్జెన్సీ వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో ఉద్యోగంలో పెట్టుకోవడంపై ఆసుపత్రి యజమాన్యంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఒక కాంపౌండర్ స్థాయి వ్యక్తి యువతికి మత్తుమందు ఇవ్వడంపై ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ మత్తుమందు కొద్దిపాటి డోస్ అధికమైనా పేషెంట్ ప్రాణానికే ప్రమాదంగా మారుతుంది. అనస్థేషియా మందు ఆ కాంపౌండర్‌కు ఎలా లభించింది? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఘటనను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, పోలీస్ కమిషనర్ సోమవారం ఆసుపత్రికి వెళ్లి పరిశీలించారు. ఆసుపత్రి యజమాని అయిన డాక్టర్‌తోపాటు సిబ్బందిని విచారించారు. రికార్డులను పరిశీలించి, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే డీఎంహెచ్‌వోను రప్పించి తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి నిర్వహణ నిబంధనల ప్రకారం లేదంటూ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్‌లోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పేషెంట్ల పట్ల, చికిత్సల పట్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతుందనే విమర్శలున్నాయి. ఏవైనా ఘటనలు వెలుగు చూసినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేయడం, ఆ తరువాత పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. డాక్టర్, ఆసుపత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఆసుపత్రి గుర్తింపును రద్దు చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

● యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అత్యాచారం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సోమవారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు తెలిపారు. ఆసుపత్రిలో లభించిన ఇంజక్షన్, బెడ్‌షీట్ వంటి కొన్ని ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామన్నారు. రిపోర్ట్ వచ్చిన తరువాత చర్యలుంటాయని తెలిపారు. నిందితుడిని త్వరలో అరెస్టు చూపుతామని, పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెగడపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామశివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో శెకల్ల గ్రామానికిచెందిన జక్క ఆనంద్(25) అనేయువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆనంద్ ఆదివారం రాత్రి తనఅత్తగారి ఊరైన బతికెపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లింగాపూర్ గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మృతుడి తండ్రి జక్కవెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



శ్రీకర్‌రెడ్డి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువలో గల్లంతైన కాటిపెల్లి శ్రీకర్‌రెడ్డి(30) అనేయువకుడి మృతదేహం 13 రోజుల తరువాత సోమవారం లభ్యమైంది. మెట్‌పల్లి మాజీజడ్పీటీసీ సభ్యురాలు కాటిపెల్లి రాధ, కాంగ్రెస్‌నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమారుడు శ్రీకర్‌రెడ్డి గతనెల 27న మండలంలోని రామారావుపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాలువలో గల్లంత య్యాడు. వినాయకచవితి సందర్భంగా పెద్దాపూర్ గ్రామశివారులోని పౌల్ట్రీఫాంలో గణపతి పూజ నిర్వహించి ట్రాక్టర్‌లో ఇద్దరు స్నేహితులతో కలిసి ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు మిత్రులు ఒడ్డుపై పడగా కాటిపల్లి శ్రీకర్‌రెడ్డి కాలువలో పడి గల్లంతయ్యాడు. అప్పటినుంచి కుటుంబసభ్యులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. 13రోజుల తరువాత తాటిపెల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యమైంది. స్థానికులుగమనించి కుటుంబ సభ్యులకు తెలపగా వారు పరిశీలించి శ్రీకర్‌రెడ్డిగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరి వేసుకొని వలస కూలీ ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ ఇటుకబట్టీలో పనిచేసేందుకు వచ్చిన వలసకూలీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జానీ(29) వలసకూలీ. తాగుడుకు బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎవరూ లేరని మనస్తాపానికి గురయ్యేవాడు. ఈక్రమంలోనే సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిబంధువు డమురుజానీ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లిరూరల్ ఎస్సై మల్లేష్ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి జీపీ కార్మికుడి మృతి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట గ్రామ పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ కార్మికుడు బండ రాజయ్య(52) ప్రమాదవశాత్తు సోమవారం మృతిచెందాడు. చెట్లకొమ్మలు కొడుతుండగా రాజయ్య ఒక్కసారిగా కిందపడ్డాడు. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ప్రభుతేజ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

మంథనిరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ శివారు గోదావరి నది ఎల్ మడుగు ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. సుమారు 30-35 వయస్సు, ప్యాంట్, షర్టు ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమేష్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో పంచనామా అనంతరం అంత్యక్రియలు పూర్తిచేశారు. కేసునమోదుచేసుకొనిదర్యాప్తు చేస్తున్నామన్నారు.

గొర్రెల మందను ఢీకొన్న బైక్

- ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపల్లి శివారులో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై వెళ్తున్న గొర్రెల మందను సోమవారం బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన వాహనదారుడు ముత్తయ్యగారి రవి, అతని కొడుకు సాయిలతో పాటు గాజులపల్లిలోని గొర్రెలకాపారి పెద్దోళ్ల కుర్మ ఎల్లయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. పలు జీవాలు గాయ పడ్డాయి. రవి, సాయిలను 108 వాహనంలో ఎల్లయ్యను ఓ ప్రైవేటు వాహనంలో సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. గాజులపల్లికి చెందిన ఎల్లయ్య తన గొర్రెలను మేతకు తీసుకెళ్లి తిరిగి ప్రధాన రహదారి వెంట ఇంటికి తీసుకెళుతున్నాడు. గంభీరావుపేటలోని రవి తన కొడుకు సాయితో కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపుకు వెళుతూ గొర్రెల మందను అతివేగంగా ఢీకొట్టాడు. రవి, సాయితో పాటు అక్కడే ఉన్న గొర్రెల కాపారి ఎల్లయ్య తీవ్ర గాయాలపాలయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

'కొండ'కు నూతన శోభ

మల్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు కొండపై గల ఆంజనేయస్వామి ఆలయ పరిధిలోని పెద్ద బండరాళ్లకు రంగులు వేయించడంతో ఆలయ పరిసరాలు నూతన శోభను సంతరించుకున్నాయి. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుట్టపైనున్న బండరాళ్లకు వేసిన రంగులు

సీపీగెట్ ఫలితాల్లో ఎస్సారార్ విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీగెట్ ఫలితాల్లో ఎస్సారార్ కళాశాలకు చెందిన పుట్టి అఖిల వృక్షశాస్త్ర విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో ఎస్సారార్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంఘం సహకారంతో నిర్వహించిన ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. అఖిలతోపాటు విద్యార్థులు బి.మేఘమాల 6వ ర్యాంకు, సీహెచ్. సాగరిక 53, సుమయ జబీన్ 69, ఆర్. సుధాకర్ 57, కె.మౌనిక 98, జి.నర్మదా 96, మౌనిక 134, వి.మహేందర్ 324, సీహెచ్.పల్లవి రెడ్డి 334, కే. అంజలి 819, ఎన్.రోజా 893, బి.అఖిల 957వ ర్యాంకుతోపాటు 40 మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సారార్ కళాశాలతో పాటు, హైదరాబాదు లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి ఉమెన్స్ కాలేజ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీకళాశాల జగిత్యాల సంయుక్తంగా ఆన్‌లైన్ కోచింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ మొదటి ర్యాంకు సాధించిన అఖిలను అభినందించారు.



అఖిల

వాగులో పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

మంథని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని బొక్కలవాగులో ఆదివారం రాత్రి భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామానికిచెందిన కామ సురేష్ వాగులో పడ్డాడు. అదేసమయంలో అటుగావెళ్తున్న పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది గమనించి 108కు సమాచారం ఇచ్చారు. 108 మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్, పైలెట్ ఆకుల మల్లేష్, పోలీసులు కలిసి అతడిని బయటకు తీసి ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వచ్చి సురేష్ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందికి, పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దె నిర్మించారు
- దానిపై పెట్టడం మరిచారు

తిమ్మాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజీవ్ రహదారిని ఆనుకొని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఓ బండ రాయిపై ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఓ వైపు కిందికి వంగినట్లు ఉండటంతో అదిచూసిన వారు భయాందోళకు గురవుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాయిపై నుంచి మార్చేందుకు ఏనాడో ఓ గద్దెను కూడా నిర్మించిన విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ పెట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రాజీవ్ రహదారికి ఆనుకొని ఉండటం.. నిత్యం వందల వాహనాలు, ప్రయాణికులు ఈ దారి వెంబడి ప్రయాణిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బండ రాయి చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి ప్రమాదంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి కంచే ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో ఏదైనా ప్రమాదం సంభవించే ఆస్కారం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బండ రాయిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దాని కోసం నిర్మించిన గద్దెపైకి మార్చి కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రాజీవ్ రహదారికి ఆనుకొని బండరాయిపై వంగి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అధ్వానంగా రహదారి

గుంతలుగా ఖని వన్‌టౌన్ టూ ఎల్‌బీనగర్ రోడ్డు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కొన్ని నెలలుగా రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. గుంతలమయమైన రహదారిపై వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు రహదారిపై నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో నీరు నిలిచి ఉండటంతో గొయ్యి ఏర్పడింది. రహదారిని ఆనుకొని ప్రైవేట్ పాఠశాలలు ఉండడంతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. స్కూల్ బస్సులు, ఆర్‌టీసీ బస్సులు కూడా ఈ రహదారి గుండా వెళుతుంటాయి. దీంతో ఆ గొయ్యిలో పడి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. అయినా ఎవరు పట్టించుకోకపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు కట్టెను పెట్టి ఇక్కడ గొయ్యి ఉన్నది జాగ్రత్త అని ప్లకార్డు పెట్టారు. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు.



గొయ్యి ఉన్నది జాగ్రత్త అని కట్టెకు ప్లకార్డు పెట్టిన స్థానికులు

రహదారి పక్కన డ్రైనేజీ లీకేజీ...

గుంతలమైన రహదారితోపాటు పక్కనే డ్రైనేజీ నీరు లీకేజీతో దుర్గంధం వెదజల్లుతోంది. అంతే కాకుండా పారిశుధ్యం లోపించి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధుల సమయం కావడంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని, డ్రైనేజీని మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



కాలువను తలపిస్తున్న ఖని ఎల్‌బీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

30 నుంచి ముంబయికి ప్రత్యేక రైలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధికి మహారాష్ట్ర లోని ముంబయి, బీండి ప్రాంతాలకు వలస వెళ్లిన కార్మికుల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు కరీంనగర్‌కు ప్రత్యేక రైలును నడపనున్నారు ఈ నెల 30 నుంచి నవంబరు 25వరకు ప్రతీ మంగళవారం రైలు నడవనుంది. మధ్యాహ్నం 3.30గంటలకు ముంబయి లోని లోక్‌మాన్యతిలక్ టెర్మినల్ (ఎల్‌ఎల్‌టీ) నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు కరీంనగర్ నుంచి బయల్దేరి గురువారం మధ్యాహ్నం 1.40 గంటలకు ముంబయి చేరుకుటుంది. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో హాల్టింగ్ కల్పించారు. బాసర, నాసిక్, షిర్డీ వెళ్లేందుకు రైలు సౌకర్యంగా ఉంటుంది.

రాజన్న ఆలయానికి రూ. 2.18 కోట్లతో సబ్‌స్టేషన్ మంజూరు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానానికి నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.2.18కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయానికి ఆధునిక విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుందని అందులో బాగంగానే 33/11 కేవీ సామర్థ్యంతో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థ సీఎండి వరుణ్‌రెడ్డి అధికారంగా ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో రాజన్న ఆలయంలో లోవోల్టేజ్ సమస్యలు లేకుండా ఉటుందని, పరిసర ప్రాంతాలకు సైతం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందు తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు విప్ ఆదిశ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మపురి నరసింహుడి ఆలయ ప్రసాదాల రేట్లు పెంపు

ధర్మపురి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రసాదాలరేట్లు పెంచినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఉత్తర్వులమేరకు గతంలోఉన్న లడ్డూ ప్రసాదం రేటు రూ.20నుంచి25 రూపాయలకు, 200గ్రాముల పులిహోర ప్రసాదం రూ.15నుంచి 20రూపాయలకు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదం 80గ్రాముల నుంచి 100గ్రాముల వరకు పెంచినట్లు ఆయన తెలిపారు. భక్తులు గమనించా లని ఆయన కోరారు.



ఆన్‌లైన్‌లో వైద్యసేవలు

● రోగులకు అందుబాటులో ఆయుష్మాన్ భారత్ యాప్

● అందుబాటులో హెల్త్ ప్రొఫైల్, ల్యాబ్ రిపోర్టులు

చొప్పదండి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే సేవలన్నీ ఆన్‌లైన్ లో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై అర చేతిలో అన్ని సేవలు, పరీక్షలు, రిపోర్టులు, హెల్త్ ప్రొఫైల్ అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఆసు పత్రుల ఓపీ కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచోవాల్సిన పని లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాప్‌ను రూపొందించాయి.

గతంలో రోగులకున్న సమస్య, వాడుతున్న మందులు, ల్యాబ్ పరీక్షలు, ఫలితాలన్నీ యాప్‌లో ఉంటాయి. ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు ఆయుష్మాన్ భారత్ యాప్(అభా)ను సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆసుపత్రికి వెళ్లగానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే యాప్‌లో నమోదవుతుంది. రోగి హెల్త్ ప్రొ ఫైల్ మొత్తం అభా ఐడీలో పొందుపరుస్తారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఈ యాప్ ద్వారా వైద్య సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి.

అభా పనిచేస్తుంది ఇలా...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాప్‌ను రూపొందించాయి. అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభా యాప్ ద్వారా వైద్య సేవలను అందిస్తున్నారు. రోగి తన మొబైల్ ఫోన్‌లో ఆధార్ ఆధారంగా అభా హెల్త్ అకౌంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కోవాలి. హెల్త్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలి. అభా కార్డు అకౌంట్ నంబర్ వస్తుంది. రోగి ఏదైనా ఆసుపత్రికి వెళ్లినప్పుడు ఓపీ కోసం లైన్‌లో నిలుచోవాల్సిన అవసరం లేకుండా ఓపీ కౌంటర్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను అభా యాప్‌తో స్కాన్ చేయాలి. వెంటనే ఓ నంబర్ మొబైల్‌కు వస్తుంది. ఆ నంబర్‌ను ఓపీ కౌంటర్‌లో చూపించగానే, రోగి పేరుతో చీటి ఇవ్వ గానే డాక్టర్ వద్దకు వెళ్లాలి. ఏవైనా వైద్య పరీక్షలు చేయించుకుంటే ల్యాబ్ రిపోర్టులను అభాహెల్త్ కార్డులో పొందు పరుస్తారు. రిపోర్టుల కోసం ఎదురు చూడకుండా మొబైల్‌లోనే డాక్టర్‌కు ల్యాబ్ రిపోర్టులను చూపిస్తే సరిపోతుంది. తర్వాత డాక్టర్ రాసి న మందుల చీటిని (ప్రిస్కిప్షన్) కూడా యాప్‌లో పొందుపరుస్తారు. తద్వారా రోగి ఏ మందులు వాడుతున్నాడో సమాచారం యాప్‌లో నమోదవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో రోగికి సంబంధించిన పరీక్షలు, మందుల వాడకం వివ రాలు డాక్టర్‌కు తెలుస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసు పత్రికి వచ్చే రోగి ఆరోగ్య వివరాలను, షుగర్, బీపీతో ఇతర వ్యాధులకు సంబంధించిన వివరాలు డాక్టర్‌కు తెలుస్తాయి. తద్వా రా ఎలాంటి చికిత్సలు అందించాలో వైద్యులకు ఒక అవగాహనకు వస్తారు. హెల్త్ కార్డు ద్వారా రోగితో పాటు వైద్యులకు ఎంతో ఉపయోగకరం గా ఉంటుంది. అన్ని వివరాలు, సేవలు అభా యాప్‌లో అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో కార్డు ఉన్న ప్రతి ఒక్కరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.



చికితను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



చికితను సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఎలిగేడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరెన్నో విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గుర్తింపుతేవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల కెనడాలో జరిగిన ప్రపంచయూత్ ఆర్చరీ చాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకం సాధించి వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తానిపర్తి చికిత సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోగల సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలువగా సీఎం చికితను అభినందించారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా రాష్ట్రప్రభుత్వం తరఫున చికితకు శిక్షణ అందించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్‌రావు, స్పోర్ట్స్‌అథారిటీచైర్మన్ శివసేన రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, మాజీసర్పంచ్ అర్వణపల్లి వెంకటేశ్వర్ రావు, తానిపర్తి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక



అంపశయ్య నవీన్



అంతడుపుల రమాదేవి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఈ ఏడాది సాహిత్య విభాగంలో నవలా రచయిత అంపశయ్య నవీన్, కళా రంగంలో అంతడుపుల రమాదేవి ఎంపికైనట్లు అవార్డుల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తనతండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏటారచయితలు, కళకారులకు పురస్కారాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఎంపికకమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం రవిచంద్ర సారథ్యంలో జ్యూరీకమిటీసభ్యులు కేంద్రసమాచారశాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, జర్నలిస్టు దిలీప్‌రెడ్డి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి సోమవారం కరీంనగర్‌లో ట్రస్టు చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపిక పత్రాన్ని అందజేశారు. పొన్నం సత్తయ్య 15వవర్ధంతి సందర్భంగా ఈనెల 13వ తేదీన రవీంద్ర భారతిలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

తెరుచుకున్న ఆలయాలు

● ఆలయాల్లో శుద్ధి, సంప్రోక్షణ

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి రాజన్న ఆలయం మూసివేయగా సోమవారం తెల్లవారుజామున ఉదయం 3.45 గంటలకు ఆలయాన్ని తెరిచారు. ఆలయసిబ్బంది ఆలయ గోపురాలు, విగ్రహాలను శుద్ధిచేశారు. అనంతరం అర్చకులు ఆలయంలో తిరుగా సంప్రోక్షణ చేశారు. మంగళవాయి ద్యాలు, సుప్రభాతం గావించారు. పూజలునిర్వహించి భక్తులకు దర్శనాలకు, నిత్యపూజలకు అనుమతిచ్చారు.

రాజన్నను దర్శించుకున్న భక్తులు

శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించి పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం రాజన్నను దర్శించుకుని తరించారు. కొందరు స్వామివారికి ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు



ధర్మపురిలో విగ్రహాల తొడుగులను కడుగుతున్న అర్చకులు

ధర్మపురిలో..

ధర్మపురి: సంపూర్ణ చంద్రగ్రహణం వీడిన అనంతరం ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని సోమవారం ఉదయం తెరచి ఉంచారు. అర్చకులు సంప్రోక్షణ, చంద్రగ్రహణ శాంతి హోమం, పూర్ణాహుతి, అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. చంద్ర గ్రహణం వీడిన అనంతరం ధర్మపురి గోదావరి నదిలో భక్తులు సోమవారం గ్రహణ స్నానాలు ఆచరించారు. అనంతరం భారీసంఖ్యలో భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయధర్మకర్తలమండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: చంద్రగ్రహణం దృష్ట్యా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేయగా సోమవారం వేకువజామున ఆలయంలో పుణ్యాహవచనం, సంప్రోక్షణ, తిరుమంజనం, ఆరాధన పూజలు జరిపిన అనంతరం ఉదయం 7గంటలకు తెరిచారు. అనంతరం యథావిధిగా దర్శనాలు, ఆర్జితసేవలు పునరుద్ధరించగా వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అన్నదాతకు కరెంటు కష్టాలు

● వర్షాలతో పోల్స్ విరిగి తెగిన విద్యుత్ లైన్లు

● జనరేటర్‌తో పంటలకు నీరు

గంభీరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు కొట్టుకుపోగా, మరికొన్ని పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఇదిలా ఉంటే వరదల కారణంగా కొన్ని గ్రామాల్లో విద్యుత్ పోల్స్ విగిరి, లైన్లు తెగిపోయాయి. దీంతో కరంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బోరుబావుల్లో, వ్యవసాయ బావుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్నా పంటలు ఎండిపోయే దశకు చేరుతున్నాయి. మండుతున్న ఎండలకు వరిపంటకు నీళ్లు అందక ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు జనరేటర్ సహాయంతో మోటార్లు నడిపిస్తూ పంటలను రక్షించుకుంటున్నారు. భారీ వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు మత్తడి దూకి, వాగులు ఉప్పొంగాయి. దీంతో కరుంటు స్తంభాలు విరిగి లైన్లు తెగిపోయాయి. ప్రధానంగా మండలంలోని మల్లారెడ్డిపేట ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. దీంతో వరి పంటను కాపాడుకోటానికి మల్లారెడ్డిపేటకు చెందిన రైతు భూపతి జనరేటర్ కిరాయి తెచ్చాడు. జనరేటర్ సహాయంలో వరి పంటకు నీరు పెడుతున్నాడు. ఎకరం పంటకు జనరేటర్ కిరాయితో పాటు డీజిల్ ఖర్చుతో 2 వేల వరకు అవుతున్నాయని రైతు భూపతి ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ పోల్స్, వైర్లను సరిచేసి కరంటు కష్టాలు తీర్చాలని రైతు భూపతి అధికారులను వేడుకుంటున్నాడు.



మల్లారెడ్డిపేటలో పంటను కాపాడేందుకు జనరేటర్ సహాయంతో నీరు అందిస్తున్న రైతు

జేఎన్టీయూ విద్యార్థుల రాస్తారోకో

● వేములవాడ-సిరిసిల్ల రోడ్డుపై గంటకు పైగా బైఠాయింపు

● నూతన క్యాంపస్ ఏర్పాటు చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న జేఎన్టీయూ విద్యార్థులు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూ కళాశాలకు నూతన క్యాంపస్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థిసంఘం నాయకులు వేములవాడ-సిరిసిల్ల ప్రధానరహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. తంగళపల్లి మండలం మండెపల్లి గ్రామంలో జేఎన్‌టీయూ కళాశాల నిర్మించేందుకు గత ప్రభుత్వం జీవో జారీ చేసిందని, వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జేఎన్‌టీయూకు అప్పగించిన భవనంలోని తరగతి గదులకు తాళం వేశారని, దీంతో తీవ్ర ఆందోళనకు గురై రాస్తారోకో చేసినట్లు విద్యార్థులు తెలిపారు. కళాశాలలో ఎలాంటి సౌకర్యాలు లేవని, ల్యాబ్‌కోసం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు జేఎన్‌టీయూ యూనివర్సిటీకి ప్రాక్టికల్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏఎస్పీ చంద్రయ్య, సీఐ వీరప్రసాద్‌లు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో రోడ్డు పైన భారీగా వాహనాలు నిలిచిపో యాయి. దీంతో పోలీసులు విద్యార్థులను, విద్యార్థి సంఘం నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఓ విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో తోటి విద్యార్థులకు పక్కకు తీసుకెళ్లారు.

విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలి

- బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహారావు

జేఎన్‌టీయూ విద్యార్థుల నాణ్యమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్‌నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు డిమాండ్‌చేశారు. విద్యార్థుల రాస్తారోకో విషయం తెలుసుకున్న లక్ష్మీనర్సిం హారావు పోలీస్‌స్టేషన్‌లోని విద్యార్థులను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం చల్మెడ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లాలో జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఉండాలని మండెపల్లిలో 20 ఎకరాల స్థలాన్ని చూసి, సుమారు రూ. 450 కోట్లతో జీవో విడుదల చేశారని గుర్తు చేశారు. వెంటనే జేఎన్‌టీయూ భవనానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బొల్లా రామ్మోహన్, రామతీర్థాపు రాజు, కంకణాల క్రాంతి, మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, నీలం శేఖర్ తదితరులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

● భీమేశ్వర ఆలయంలో పనులు పూర్తి చేయాలి ● రాజన్న ఆలయ ఈవో రమాదేవి



భీమేశ్వర సదన్ వసతిగృహంలో తనిఖీ చేస్తున్న ఈవో రమాదేవి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆయా విభాగాల ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఈవో రమాదేవి సూచించారు. రాజన్న ఆలయంలోని భీమేశ్వర సదన్ వసతి గృహాలను, భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం తనిఖీ చేశారు. వసతిగృహంలో ఆన్‌లైన్ ద్వారా, ఆఫ్‌లైన్ ద్వారా భక్తులు ఎన్ని రూమ్‌లు బుక్ చేసుకున్నారని, ఎన్ని రూములు ఖాళీగా ఉంటున్నాయని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. రూములకోసం వచ్చే భక్తులతో మర్యాద పూర్వంగా మెదలాలని ఈవో సూచించారు. భీమేశ్వర ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. భీమేశ్వర ఆలయంలో చేపడుతున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావాలని, దానికి అనుగుణంగా ఉద్యోగులు, భక్తులు సహకరించాలని కోరారు. రాజన్నఆలయానికి వచ్చేభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునే భక్తులకోసం ఈ-టికెటింగ్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు.

ఏఎస్పీని కలిసిన ఈవో రమాదేవి

వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిని రాజన్న ఆలయఈవో రమాదేవి సోమవారం కలిశారు. పట్టణంలోని డీఎస్పీ కార్యలయంలో ఏఎస్పీకి పూలమొక్కను, రాజన్నప్రసాదాన్ని అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టునుంచి గేట్లద్వారా గోదావరిలోకి నీరు వదలడం సోమవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువప్రాంతం నుంచి 54,185క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8గేట్లు పైకిఎత్తి నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టునీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరునిల్వ ఉంది. వరదకాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయకాలువకు 5,500క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 684క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

'అన్నపూర్ణ'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ ప్రస్తుతం 3.23టీఎంసీలకు చేరుకుంది. మద్యమానేరు ద్వారా 6,400క్యూసెక్కుల నీటిని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తుండగా, అక్కడినుంచి రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) సోమవారం 16,800ఇన్‌ఫ్లో ఉన్నది. ఎస్సారెస్పీనుంచి వరద కాలువద్వారా 16,300, మానేరు మూలవాగు ద్వారా 500క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగివన ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్లద్వారా 10వేల క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటినితరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.19టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్ఎండీకి పెరిగిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్: కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలోకి ఎగువనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 23టీఎంసీ లకు చేరింది. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్‌మానేరు) గేట్లు తిరిగి బుధవారం ఉదయం ఎత్తి ఎల్ఎండీలోకి అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మిడ్‌మా నేరునుంచి 10వేల క్యూసెక్కుల వస్తుండగా వాటితోపాటు ఎగువ కాకా తీయ కాలువనుంచి 900 క్యూసెక్కులు, మోయ తుమ్మెద వాగునుంచి 239క్యూసెక్కులు కలిపి 11,139 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. అదేవిధంగా ఎల్ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు 3వేలక్యూసెక్కుల నుంచి బుధవారం 5వేలక్యూసెక్కుల పెంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోవెలుతోంది. ఎల్ఎండీ పూర్తినీటిసామర్థ్యం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.044 టీఎం సీల నీరు నిల్వ ఉంది.



కాకతీయ కాలువ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

నేడు ఎల్ఎండీ గేట్లు ఎత్తే అవకాశం?

సోమవారం చాలాచోట్ల వర్షం కురిసింది. దీంతో ఎగువ నుంచి ఎల్ఎండీలోకి ప్రస్తుతం వస్తున్న పెరిగిన వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా మంగళవారం ఎల్ఎండీ గేట్లు అవసరం మేరా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఒకవేళ ఇన్‌ఫ్లో తగ్గితే మాత్రం కొద్దిగా ఆలస్యం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే కాకతీయ కాలువ ద్వారా దిగువకు 5వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇప్పటికే ఎగువనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో ఎల్ఎండీ దాదాపుగా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. కాబట్టి ఎల్ఎండీ గేట్లు ఎత్తే అవకాశం ఎక్కువగా ఉంది.

'కందుకూరి' రావికంటి వసునందన్ సాహిత్య పురస్కారం



కందుకూరి అంజయ్య

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ రావికంటి వసునందన్ సాహిత్యపురస్కారానికి రచయిత కందుకూరి అంజయ్య ఎంపికైనట్లు పరిషత్తు ప్రధానకార్యదర్శి డాక్టర్ చెన్నయ్య ప్రకటనలో తెలిపారు. ఏటా అందజేసే తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారాల్లో భాగంగా ఈ ఏడాదికి అంజయ్యను ఎంపిక చేశారు. ఈనెల18న పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పురస్కారం అందజేయనున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం గుళ్లకోటలో జన్మించిన అంజయ్య ఎంఏ ఎంఫిల్ పూర్తి చేశారు. చేనేత జౌళిశాఖలో డిప్యూటీడైరెక్టర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. కట్టిపల్క, జమిడిక పుస్తకాలను వెలువరించారు. ఎన్నీల ముచ్చట్ల కవితాసంపుటలకు, విద్యార్థి కలం పుస్తకానికి సంపాదకులుగా వ్యవహరించారు. అలిశెట్టి ప్రభాకర్, అక్కిపెల్లి ఫౌండేషన్ సినారె విశిష్ట పురస్కారాలను అందుకున్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ గ్రామానికి చెందిన మ్యాదరి అశోక్ ఇటీవల బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికవగా సోమవారం జగిత్యాల పట్టణం లోని మార్కెండేయ ఆలయ ఆవరణలో ఆయనను భారత సురక్షసమితి, పద్మశాలి సేవాసంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈకార్యక్రమంలో భారత సురక్ష సమితి, పద్మశాలి సేవాసంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

రాయికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాయికల్ మంలల ప్రధాన కార్యదర్శిగా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాయికల్ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్ సోమవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటించారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు

రాయికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరాటేతో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని రాయికల్ ఎస్సై సుధీర్ రావు అన్నారు. రాయికల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో జరిగిన 3వ రాష్ట్ర స్థాయి ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ అండ్ కరాటే ఛాపింయన్‌షిప్-2025 పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారికి పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కనుక ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

12 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

కొడిమ్యాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12, 15 తేదీలలో 14, 17 సంవత్సరాల లోపు బాల బాలికలకు మండల స్థాయి ఎస్.జీ.ఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు మండల కమిటీ ఛైర్మన్, ఎంఈవో ఎ. శ్రీనివాస్, ఎస్.జీ.ఎఫ్ మండల కన్వీనర్, పీడీ బూట్ల రాజమల్లయ్య సోమవారం తెలిపారు. క్రీడల్లో పాల్గొనదలిచిన వారు పుట్టిన తేది, చదువు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఆసక్తి గల వారు తమ ఎంట్రీలను ఈ నెల 11లోపు అందించాలన్నారు. పూర్తి వివ రాలకు పీడీ రాజమల్లయ్య 9441431287 సెల్ నెంబర్‌లో ఆసక్తిగల వారు సంప్రదించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెల్గటూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కప్పారావుపేట గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్, కోటిలింగాల ఆలయ కమిటీ ఛైర్మన్ పూదరి రమేష్, గ్రామశాఖ అధ్యక్షుడు మ్యాకల పోచయ్య, దావుల శశి, మూగల జితేందర్, గుండాటి సందీప్ రెడ్డి, గంద్ర శ్రీకాంత్ రావు, ఆలయ ధర్మకర్త గుమ్ముల వెంకటేష్, రేగుంట నర్సయ్య, కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై అఖిలపక్ష సమావేశం

జగిత్యాల రూరల్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాపై అభ్యంతరాలపై జిల్లాలోని పలు మండలాల్లో ఎంపీడీవోలు సోమవారం అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహిం చారు. సోమవారం జగిత్యాల అర్బన్, రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు విజయలక్ష్మీ, రమాదేవి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఓటర్ జాబితాపై అభ్యంతరాలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీని యర్ అసిస్టెంట్ రాంప్రసాద్, సూపరిండెంట్ శ్రీనివాస్, నాయకులు శ్రీరాముల గంగాధర్, తుమ్మగంగాధర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న మెట్‌పల్లి ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి

●**కోరుట్ల రూరల్:** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో రామకృష్ణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు భూమేశ్వర్, ముక్కెర లింబాద్రీ, ప్రశాంత్, సుతారి రాముల, రఫీలు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పత్తి రవీందర్ సోమవారం అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మపురి ఏఎంసీ మాజీ ఛైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, ధర్మపురి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, సీపతి సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, టీడీపీ బాధ్యులు ఉప్పుల రామకిష్టయ్య, సింహరాజు ప్రసాద్, స్తంభంకాడి మహేష్, ముడుగం రాజలింగు, కామెర ప్రభాకర్, ఓగేటి అంజయ్య, స్వర్గం వీరేశం, ఓరుగంటి చంద్రశేఖర్, జెల్ల వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** ఎంపీడీవో చిరంజీవి ఓటర్ల జాబితా అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వమించారు. పార్టీ ప్రజాప్రతినిధుల నుంచి సలహాలు స్వీకరించారు.

●**కొడిమ్యాల:** ఎంపీడీవో స్వరూప వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి, మల్లేశంయాదవ్, కిషన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు నర్సాగౌడ్, బీఎస్పీ నాయకుడు మల్లేశం, బీజేపీ నాయకుడు నర్సింహరెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●**మల్యాల:** మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, సుపరిండెంట్ నాగరాజు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** అన్ని పార్టీల రాజకీయ నాయకులతో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, భాస్కర్, బీఆర్ఎస్ అధ్యక్షులు లోక మల్లారెడ్డి, బిజెపి అధ్యక్షులు పల్లె మోహన్‌రెడ్డి, సీపీఐ అధ్యక్షులు భూమేశ్వర్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** ఎంపీడీఓ శంకర్ నాయక్ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు.పోలింగ్‌బూత్‌ల ఏర్పాటుపై ఎలాంటి అభ్యంతరాలు రాజకీయ పార్టీలు తెలపలేదని పేర్కొన్నారు.

●**బీర్‌పూర్:** ఆయా పార్టీల నాయకులతో ఎంపీడీవో భీమేష్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చెరుపూరి సుభాష్ యాదవ్, ఆడెపు నర్సయ్య, నేరెల్ల సుమన్, నారపాక అశోక్ పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** ఎంపీడీవో గంగాధర్ అధ్యక్షతన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, రాజన్న, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినారు. నాయకులకు కార్యాలయ సూపరింటెండెంట్ రాణి, ఓటరు జాబితాను, కేంద్రాల ఏర్పాటును వివరించారు.

●**వెల్గటూర్:** ఎంపీడీవో కృపాకర్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు జనార్ధన్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, మెరుగు మురళి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

కోరుట్ల, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపకార వేతనాలు వెంటనే చెల్లించాలని శాతవాహన యూనివర్సిటి ప్రైవేట్ కళాశాల జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పోతని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని ఆరుణోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులచే ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణం లోని కార్గిల్ చౌరస్తా నుండి కాలేజీ వరకు సాగింది. ఈ సందర్భంగా పోతని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మూడు సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించక పోవడంతో విద్యా ర్థులు ఇబ్బందులు పాలు అవుతున్నారని అన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు వెంటనే చెల్లించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యా ర్థులు, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

-ఇబ్బందులు పడుతున్న నామాపూర్ గ్రామస్థులు -పట్టించుకోని అధికారులు



నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం

పెగడపల్లి, సెప్టెబరు 8 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో అని గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు. మండలంలోని నామాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలోనే రూ.20లక్షలు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నేటికీ నిర్మాణ పనులు పూర్తి కాక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని వాటర్ ప్లాంట్‌లో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. నిర్మాణ పనులు చేసే విషయంలో నువ్వా నేనా అంటూ కొంత కాలం గడపగా పనులు ప్రారంభమై ఏడాదిన్నరవుతుండగా స్లాబ్ నిర్మాణం చేపట్టి గోడలు నిర్మాణం చేపట్టక వదిలేశారు. దీంతో గ్రామ పంచాయతీ పాలనా వ్యవహారాలకు కార్యాలయం లేక అటు ఉద్యోగులు, ఇటు వివిధ పనుల నిమిత్తం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని నిర్మాణ పనులు పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కారును ఢీకొట్టిన టిప్పర్

-ఇద్దరికి గాయాలు

ధర్మపురి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం రాయపట్నం వద్ద కారును టిప్పర్ ఢీకొట్టిన సంఘటనలో సోమవారం రాత్రి ఇద్దరు గాయపడ్డారు. కరీంనగర్ నుంచి ఆబిద్, దుర్గం వెంకటరమణ అనే ఇద్దరు వ్యక్తులు కారులో మంచిర్యాలకు వెళ్తుండగా రాయపట్నం దగ్గర ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్ట డంతో కారులోని వ్యక్తులకు గాయాల య్యాయి. క్షతగాత్రులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తోంది.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

రాయికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మూడవ రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన కడకుంట్ల సాత్విక్, స్తంభం పావని, చిలివేరి సమన్వి, బూర్గుల శ్రీకృతి, చిలివేరి విహన్, మిసారీ అద్భుత క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి బంగారు పతకాలను సాధించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను, కరాటే మాస్టర్ కనుక ప్రభాకర్‌లను ప్రగతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ బాలె నిఖిల్ కుమార్‌లు అభినందించారు.

హెపటైటిస్ నియంత్రణపై నజర్

(5వపేజీ తరువాయి)

దాని కంటే ఎక్కువ ఉండి వైరల్ లోడ్ 5లక్షల కంటే ఎక్కువ ఉందంటే వీరికి భవిష్యత్‌లో లివర్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈవ్యాధి సోకిన వారు ఆల్కహాల్ తీసుకోవద్దని, తరచూ వైద్యుల పర్యవేక్షణ అవసరమని వైద్య నిపుణులు సూచిస్తు న్నారు. హెపటైటిస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. టూత్‌బ్రష్‌లు, రేజర్లు, నెయిల్ కట్టర్లు, సెలూన్లలో ఒకరికి వాడిన బ్లేడ్‌లను ఇతరులు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పచ్చ బొట్టు వేయించుకునేవారు, చెవులు, ముక్కులు కుట్టటం వంటి పరిక రాలు ఒకరికి వాడిన వాటిని మరొకరు వాడకుండా చూసుకోవాలి. రక్త మార్పిడి, సురక్షితం కాని శృంగారం, తల్లి నుంచి బిడ్డకు హైపటైటిస్ సోకే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. దీని నివారణకు వ్యక్తి గత పరిశుభ్రతను పాటించడం, రక్షిత నీరు, ఆహారం తీసుకోవాలని, హెపటైటిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

-ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(డీసీఆర్‌బీ) ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దత్తాద్రికి ఇటీవల ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సోమవారం దత్తాద్రి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. దత్తాద్రిని ఎస్పీ అభినందించి స్టార్ చిహ్నాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని వెంటనే పాఠశాల నూతన భవన నిర్మాణంకు నిధులు మూడు కోట్ల 60 లక్షల రూపాయలు మంజూర్ చేయాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకో వడంతో విద్యార్థులకు ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. సమస్య పట్ల మంత్రి సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, కాంగ్రెస్ నాయకులు నల్ల రాజన్న పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



ల్యాగలమర్రిలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పెగడపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి కోరారు. సోమవారం పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రిలో పార్టీ సమావేశం నిర్వహించారు. ార్యక్రమంలో నాయకులు నరేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజశేఖర్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, లక్ష్మణ్, రవి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఆసుపత్రిలో సోమవారం రాత్రి గంట సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో రోగులు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెట్ల కొమ్మలు కొట్టివేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆసుపత్రిలో ఉన్న పలువురు రోగులు చీకట్లోనే ఉన్నారు.

ఆసుపత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ సిబ్బంది దానిని ఆన్ చేయకపోవడంతో చీకట్లో రోగులు తమ బెడ్ ఎక్కడుందోనని వెతుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది. అయితే ఆసుపత్రి నిర్వహణలో సిబ్బంది తీరుపై రోగులు వారి బంధువులు అసహనం వ్యక్తం చేశారు.

పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలి

జగిత్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ క్వార్టర్స్‌లో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఇందిరా భవన్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగిత్యాల పట్టణంలో న్యూ బస్టాండ్ నుంచి ఓల్డ్ బస్టాండ్ వరకు రద్దీ ఎక్కువ ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో ఒక్క పెట్రోల్ బంక్ కూడా లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును మేడిగడ్డ వద్ద కాకుండా తుమ్మిడి హట్టి వద్ద నిర్మిస్తే బాగుండేదన్నారు. సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ, నాయకులు గాజుల రాజేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, దుర్గయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం వద్ద గుంత పూడ్చివేత

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోరుట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో విద్యుత్‌స్తంభం దగ్గర ప్రమాదకరంగా గుంత ఏర్పడడంతో అధికారులు గుంతను పూడ్చి వేయించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'పొంచి ఉన్న ప్రమాదం' అన్న శీర్షికన కథనం ప్రచురితం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పదించారు. సోమవారం డీఈ రఘుపతి ఆధ్వర్యంలో ఏఈలు శ్యాంరావు, సత్యనారాయణ స్పందించి సిబ్బందితో గుంతను పూడ్చి వేయించారు.

వంతెనకు మరమ్మతులు

మల్యాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో గల వరదకాలువ వంతెనపై ప్రమాదకర గుంతలు ఏర్పడి రాకపోకలకు అసౌకర్యంగా మారడంతో గ్రామ సమన్వయ సంఘం ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడంతోనే తామే మరమ్మతులు చేపట్టినట్లు గ్రామ సమన్వయ సంఘం తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సామ మహిపాల్‌రెడ్డి, ముల్క మల్లయ్య, పొనగంటి రమేశ్, కడువ గంగమల్లు, మోత్కుల నర్సయ్య, మర్రి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అన్నదానం

మల్యాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులకు అక్కడి పోలీస్ అవుట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై రమణారెడ్డి అన్నదానం చేశారు. చంద్రగ్రహణం దృష్ట్యా ఆదివారం రాత్రి కొండపైన ఎలాంటి బోజన సదూపాయం అందుబాటులో లేకపోవడంతో రమణారెడ్డి బోజనం తయారి చేయించి అందించారు.

యాచకురాలి సంచిలో రూ.30వేలు

● అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబసభ్యులకు అందజేత

మల్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో ఓ యాచకురాలి సంచిలో రూ.30వేలు లభించాయి. ఆ సొమ్ములను స్థానిక అవుట్‌పోస్టు పోలీసులు సోమవారం యాచకురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంకు చెందిన పద్మ అనే మహిళ కొన్నేళ్లుగా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో యాచిస్తుండేది. మరో వృద్ధురాలు లచ్చవ్వ అనే యాచకురాలతో కొండపైనే ఉండే పద్మ ఇటీవల అనారోగ్యంకు గురి కావడంతో వారం రోజుల క్రితం కుటుంబసభ్యులు తమ ఇంటికి తీసుకెళ్లారు. బుధవారం ఆమె మృతి చెందగా కొండగట్టులో గల పద్మ సంచిలో రూ.30వేల వరకు ఉండడాన్ని పోలీసులు, మరి కొందరు గుర్తించారు. వారి కుటుంబసభ్యులు సోమవారం రాగా ఏఎస్సై రమణారెడ్డి, ఆలయ అధికారులు ఉమామహేశ్వర్, రాజేందర్‌రెడ్డి కుటుంబసభ్యులకు రూ.20వేలు అందించి మిగితా రూ.10వేలను ఆమేతో గల వృద్ధురాలికి అందజేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

కోరుట్ల, సెప్టెంబరు8: విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి నరేశం, ఎంపీడీఓ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని బాలికల పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందించి వారిని అభినందించి సన్మానిం చారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఆనంద రావు, నల్ల భూమయ్య, జోష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోరుట్లలో అవార్డులు పొందిన ఉపాధ్యాయులు

●**బీర్‌పూర్:** ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని 15 మంది టీచర్లను సోమవారం ఎంఈవో నాగభూషణం ఆధ్వర్యంలో ఎమ్మార్సీ భవనంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** విజ్ఞాన అభివృద్ధికి గురువు పునాదిలాటి వారని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 24 మందికి సన్మాన కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి చౌడారపు గంగాధర్, మండల విద్యాధికారి కిషోర్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, అచ్యుతరెడ్డి, మధు సుధన్, యుగందర్ వర్మ, గోవర్ధన ప్రసాద్ పాల్గొన్నారు.

●**బుగ్గారం:** ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుగ్గారం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిం చారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు మోహన్‌రెడ్డి, వెలుగొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని ఎంపీడీవో స్వరూప, ఎంఈవో శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వెంకటస్వామి, రాజన్న, రాజగంగయ్య, శ్రీనివాస్, అంజయ్య, ప్రణీత, దేవరాజం, జగదీశ్వర్, అమీదుల్లాఖాన్, శ్రీనివాస్, స్వామి, ఉమేష్, ఉషారాణి, స్వప్నకు అవార్డులను, ప్రశంసా పత్రాలను అందించి, శాలువాలను కప్పి ఘనంగా సన్మానం చేశారు.

●**వెల్గటూర్:** ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

●**రాయికల్:** ఉపాధ్యాయులు విద్యా రథసారథులని రాయికల్ తహసీల్దార్ నాగార్జున అన్నారు. రాయికల్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22 మంది సీనియర్ ఉపాధ్యాయులను, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు సురేందర్, సతీష్, నరేష్, సుజాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ప్రధానో పాధ్యాయులు కాపు శ్రీనివాస్, బోగ రమేష్, రమణి, ఉపాధ్యాయ సంఘ నాయకులు అంతడుపుల గంగరాజం, రజనీకాంత్, రాజ్‌కిషోర్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను మండల విద్యాధికారి బండారి మధు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నారాయణ, తహశీల్దార్ బిఎస్ఎస్ వరప్రసాద్, ఎంపీడీవో సలీం పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానంపై అవగాహన ఉండాలి

కొడిమ్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ధ్యానంపై అవగాహన కలిగి ఉండాలని హార్ట్‌ఫుల్ నెస్ స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ మంచాల కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ ధ్యాన శిక్షణ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణు, స్టూడెంట్ కౌన్సిలర్ తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

పెగడపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పెగడపల్లి మండలం రామభద్రునిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఎద్దు మల్లమ్మతో పాటు చిలుక రాజిరెడ్డి, పల్లె రమ, నాగుల విజయ, పల్లె పద్మ, నెత్తట్ల పర్శరాం, గన్న త్తుల శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు కోరుకంటి రాజేశ్వర్‌రావు,శ్రీనివాస్‌రావు ఉన్నారు.

పెన్షన్‌దారుల హామీలను నెరవేర్చాలి

జగిత్యాల, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ఆరు వేలు, చేయూత పెన్షన్ దారులకు నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇస్తానని మోసగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని జగిత్యాల జిల్లా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ డిమాండ్ చే శారు. సోమవారం ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ వికలాంగులకు ఆరు వేలు, వితంతువులకు, ఒంటరి మహిళలకు నాలుగు వేలు, కండరాల బలహీనత కలిగిన వారికి 15 వేల రూపాయలు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారం చేపట్టి 21 నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్‌పెల్లి లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, దూమాల గంగారాం బెజ్జంకి సతీష్, బోనగిరి కిషన్, శనిగారపు కాంతక్క, సంగెపు బొల్లారపు దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వికలాంగులు

ఉపాధ్యాయ దినోత్సవం

రాయికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతి పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో సోమవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్క రించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమ్మెంతుల వెంకట రమణి, బొలెల చిన్నయ్య, తోట శంకరయ్య, ఎండీ షహబాబ్ హుస్సేన్, పులిశెట్టి సంజయ్ కుమార్, ఖమారుద్దీన్, తాటిపెల్లి వేణుగోపాల్, కూరగాయల సురేష్, కోల రాజగోపాల్, గాలి పుష్పలత, పల్లెం భవానీ, పోచంపల్లి సరోజన, చింత శైలజ, భైర్నేని వంశీధర్ రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

●ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

మల్లాపూర్, సెప్టెంబరు 08 (ఆంధ్రజ్యోతి): కొత్తదాంరాజుపల్లి, పాత దాంరాజుపల్లిలలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కుస్థాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షేడ్ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈగీఎస్ నిధులు వెచ్చించి సంబంధించిన పనులను జరుప నున్నారు. జరిపిన భూమి పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి, నాయకులు నర్సారెడ్డి, మైదాను శ్రీనివాస్, మామిడాల గంగాధర్, నిగ రవి, హన్మంత్, సుధాకర్, రాజారెడ్డి, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై క్షీరాభిషేకం

కథలాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోట-పోతారం లొంకరామన్న ఆలయం దాకా ట్రైబల్ వెల్ఫేర్ నిధులు రూ.5.30 కోట్ల నిధులు వెచ్చించడం పట్ల సోమవారం పోతారంవాసులు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నం, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్, మల్లేశ్, రెడ్డి, గొల్లం రమేశ్, నాగుల భూమగంగారాం, పాలెపు నారాయణ, ఇంద్రాల రాము తదితరులు ఉన్నారు.